# మధ్యతరగతి మందహాసం

దమ్మ
శ్రీనివాసబాబు



"అమ్మా! బాత్‌రూంలో సబ్బు లేదు." బాత్‌రూంలోంచే కేకేశాడు మూర్తి.

"వేణూ! అన్నయ్య పిలుస్తున్నాడు చూడు" అంది అమ్మ వంటగదిలోంచి.

"సబ్బులేవ్" అనేశాడు వేణు విక్కచ్చిగా.

"గట్టిగా అరవకు. డాడీ వింటే సబ్బులుకూడా అంతగా ఖర్చవుతున్నాయా అని అక్షింతలు వేస్తారు" అన్నాడు మూర్తి.

"మన చర్మ సౌందర్య రహస్యం. ఇదిగో సబ్బు" అంటూ నవ్వుతూ

బట్టల సబ్బు అందించింది పెద్ద చెల్లాయి.

"ఏమిట్రా ఇది? !"

"అన్నయ్యా! ముందే చెప్పాను — ఇది చర్మ సౌందర్య రహస్య సాధనమని. ఇది బట్టల మురికినే కాదు—ముఖాలకు పట్టిన జిడ్డును, మురికిని బాగా వదిలి స్తుంది."

"తల్లీ! నీ కీ మధ్య సెన్సాఫ్ హ్యూమర్ ఎక్కువవుతున్నట్టుంది. సంతోషించాం. ఆ సౌందర్య రహస్య సాధనాన్ని రేపటికి బట్టలకోసం భద్రంగా దాచి ఉంచు" అని పట్టి నీళ్ళతో ముఖం కడుక్కొని గదిలోకి వెళ్ళిపోయాడు మూర్తి.

సబ్బుబిళ్ళ ఎట్సెట్రా కాదేదీ కవిత కనర్హం అని మహాకవి ఏ ముహూర్తాన అన్నాడోకానీ, కవిత వ్రాసుకోవడానికేమో గానీ ముఖం కడుక్కోవడానికి, స్నానం చేయడానికిమాత్రం సబ్బులు కరువయ్యాయి.

ఏది కొందామన్నా అందుకోలేనంత ఎత్తులో ఉన్నాయి ధరలు.

గడిచిన సంవత్సరం పావలా ఉన్న కాఫీ, అదే కాఫీ — క్వాలిటీలో ఇంకొంచెం చౌకబారుగా, — నలభై పైసలు. స్టూడెంట్‌గా ఉండి రోజు కొకసారైనా హోటల్ కెళ్ళకుండా ఉండడానికి సాధ్య పడుతుందా? మరి సినిమా రేట్లు. అవీ అంతే. వీటన్నిటికీ డబ్బు నాన్నగారి ఒక్కరి ఆదాయమే. జీతంలో మార్పు రాలేదు కానీ, ఇంట్లో సభ్యుల సంఖ్య, ఖర్చు సమానంగా పెరిగిపోయాయి. అయినా, భవిష్యత్తు మీద ఎంతో మంచి నమ్మకం పెంచుకొని సంసారాన్ని లాగు కొస్తున్నారు.

అద్దం ముందు నిలబడి తల దువ్వు కుంటూ వెనక జేబు తడుముకున్నాడు. చిల్లర చేతికి తగిలింది. ఇరవై అయిదు పైసలు..

బస్ పాసుంది. దీనితో ఈ రోజు గడపాలి.

కాలేజీకి బయలుదేరు తున్నప్పుడు ఎలాగూ నాన్నగా రడుగుతారు పైస లున్నాయా అని.

ఉన్నాయని చెప్పడం తన కలవాటు.

"ఎంత?" అని మామూలుగానే అడుగుతారు.

నవ్వుతూ, "ఇరవై అయిదు" అంటాడు తను.

"ఏడ్చావుగానీ, వెళ్ళి జేబులోంచి కావలసినంత తీసుకెళ్ళు" అని పొదుపు మీద లెక్చరిస్తారు.

నవ్వుతూ విని, జేబులోంచి కావలసి నంత తీసుకుని బయట పడాలి.

బస్ స్టాప్ దగ్గరి కొచ్చి నిలబడ్డాడు మూర్తి. తొందర ఉండి ఆత్రతగా ఎదురు చూస్తున్నప్పుడు ఎంతకూ బస్ రాక విసుగు కలిగించడం ఆర్టీసీ వాళ్ళకు అలవాటు.

రోజూ అదే సమయానికి బస్‌లో వచ్చే సుధ ( ఒకరిపేరు ఒకరు తరవాత తెలుసుకున్నారు ) నవ్వుతూ పక్క కొచ్చి నిలుచుంది.

పెరిగిన బస్ ఛార్జీలను గురించి మాట్లాడుకుంటుండగా — "బాబూ! గుడ్డివాడు, దానంచేయండి. మీకు మొదట మగపిల్లవాడు పుడతాడు" అంది, గుడ్డివాణ్ణి పట్టుకొచ్చి నడి పించు కొస్తున్నామె.

'అమ్మాయి, అబ్బాయి కలిసి కని పిస్తే చాలు ప్రేమికుల్లాగానో, భార్యా భర్తల్లాగానో కనిపిస్తారు కాబోలు' అనుకున్నాడు మూర్తి మనసులో.

ఆ గుడ్డివాణ్ణి తొందరగా పంపించక పోతే ఇంకేమేం దీవెనల నందిస్తుందో నన్న భయంతో, సిగ్గుతో తన హాండ్ బాగ్ తెరిచి చిల్లర తీసి వాడి చేతిలో పెట్టింది సుధ.

బస్‌స్టాప్‌లో జనం విపరీతంగా— కళ్ళు తెరిచి మూసేలోగా పెరిగిపోతున్న జనాభాలా — పెరిగిపోతున్నారు.

బస్ వచ్చినా అంతదూరమూ కిట కిటలాడే ఆ బస్‌లో కాలుపెట్టడానికి ప్రతిమాలుతూ ప్రయాణం చేయాలి. మరి గత్యంతరం లేదు.

బస్ రానే వచ్చింది. లోపల జొర బడ్డాడు మూర్తి. ఆడవాళ్ళ ఎంట్రెన్స్ లోంచి సుధ లోపలికొచ్చింది. స్కూళ్ళు, కాలేజీలు, ఆఫీసుల టైం గనక ఇసుకవేస్తే రాలనంత జనం. ( ఇసుక వేద్దామన్నా బస్సుకుపైన టాప్ ఉంటుంది గనుక వీలుపడదు. ) ఒకరి కాళ్ళు ఒకరు తొక్కుకుంటూ, 'సారీ'లు చెప్పుకుంటూ చేరవలసిన స్థలం ఎంత సేపటికి చేరతామా అని ఆలోచిస్తున్నారు.

కొంచెందూరం వెళ్ళగానే బస్సు నాపే శాడు కండక్టరు.

"ఖర్మ. ఇక్కడో అరగంట" అని తమ అసహనాన్ని ప్రదర్శించారు కొందరు.

"అతని డ్యూటీ అతను చేసుకు పోతున్నాడు. ఇది టికెట్ ఇన్స్యూరెన్స్ కంప్లీటింగ్ పాయింట్. తరవాత స్టేజిలో చెకింగ్ అయితే, ఏమన్నా జరిగితే అప్పుడు ఒక్కరైనా సమర్థి స్తారా?" అన్నా డో మధ్య తరగతి వయ స్కుడు.

"ఆర్టీసీ వాడిలా ఉన్నాడ్రా! అందుకే కండక్టర్‌ను అంతగా సపోర్టు చేస్తున్నాడు" అన్నాడు ఓ కాలేజీ కుర్రాడు వాడి ఫ్రెండ్‌తో.

"కావచ్చు. లేదా స్టాఫ్ అని ఫ్రీగా జర్నీ చేసే పెద్దమనిషి అయి కూడా ఉండచ్చు." మెల్లిగా అన్నాడు ఆ ఫ్రెండ్.

"పెద్దవాడికి ఉద్యోగం లేదు. రెండో వాడి ఆరోగ్యం బాగాలేక చదువుతున్న బి. ఎస్‌సి. మానేశాడు. అమ్మాయి పెళ్ళి ఈ సంవత్సరం చేద్దా మనుకుంటున్నాను. ఎవరికీ ఏదీ సరిగా సమకూర్చకుండానే రిటైర్ అవుతున్నాను. భవిష్యత్తును తలుచుకుంటేనే గుండె ఆగిపోతుందేమో ననిపిస్తోంది. మీ కేమండీ! ఎదిగొచ్చిన కొడుకు లున్నారు. ఇంకా ఐదారేళ్ళ సర్వీ సుంది. ఏమైనా మీరు చాలా అదృష్ట వంతులు." బస్ చివర్లో మూలగా కూర్చుని రిటైర్ కాబోతున్న పెద్ద వాళ్ళ మాటలు వింటూ తన ఇంటిని గుర్తుచేసుకుంటున్నాడు మూర్తి.

"బట్టల షాపువాడు వచ్చాడు. పోయిన నెలలో కూడా ఇవ్వలేదు" అంది అమ్మ.

"మరి నన్నేం చేయమంటావ్?" అన్నారు నాన్నగారు.

"నేను చేసిన అప్పుల్ని గురించి ఎప్పుడు అడిగినా అలాగే అంటారు. నే నెలా తీరుస్తా ననుకుంటారు?" కొంచెం స్వరం పెంచి అంది అమ్మ.

"ఇంట్లో ఒక్క పైసాకూడాలేదు" అని చూసుకుంటున్న ఆఫీసు పనిలో మునిగిపోయారు నాన్నగారు.

అమ్మ ఊరుకోలేదు. ఇంట్లో ఖర్చు మీదా, వచ్చే పోయే బంధువుల వల్ల అవుతున్న ఖర్చుమీదా, దాన్ని తీర్చలేక తాను పడుతున్న అవస్థల మీదా మాట్లాడుతూనే ఉంది.

ఇలాంటి వాతావరణం ఇంట్లో రోజూ మామూలే అని ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయారు.

ఆర్థికంగా ఎదుర్కొంటున్న సమస్య లకు ఎవరికి వాళ్ళే పరిష్కారాలను వెదుక్కుంటున్నారు.

'పెరిగిన డి. ఎ. ఎరియర్స్ పూర్తిగా



వాత్సల్యం
ఫోటో— ఐ. నరసింహమూర్తి (కాకినాడ)

వకాస్తే ఇంత బాధ ఉండేది కాదు అనుకుంటున్నారు నాన్నగారు.

ఎరియర్స్‌లో కొంత మొత్తాన్ని నిర్బంధపు డిపాజిట్ — ఆర్డినెన్స్ మూలంగా — లో జమ చేసుకోవడంవల్ల అనుకున్న మొత్తం చేతి కందలేదు. అలాగని ఖర్చులుమాత్రం తగ్గలాయా?

మొత్తం పన్నెండు మంది ఉన్న ఇంట్లో అడపాదడపా వచ్చే బంధువులు కాక, చదువుకుంటున్న వాళ్ళ కాలేజీ ఫీజులు, పుస్తకాలు, ఏ రోజు కారోజు బస్ ఛార్జీలు, పాకెట్ మనీ — ఇన్నింటినీ ఒక్కరి ఆదాయమే కవర్ చేయాలంటే సాధ్యమా?

అప్పుడప్పుడు ఇలాంటి కీచులాటలు తప్పించి, అవస్థలు పడుతున్నా సాఫీగానే సంసారాన్ని ఈదుకొస్తున్న అమ్మా నాన్నగార్లంటే ఎనలేని గౌరవం, భక్తీ ఉన్నాయి. ఈ కష్టాల్లో తా నెప్పుడు చేయూత నివ్వగలనా అని మూర్తి బాధ పడుతూ ఉంటాడు. సంపాదించే స్థితికి ఎప్పుడు చేరగలనో అని చీకటి అలుము కున్న భవిష్యత్తులోకి భయంభయంగా తొంగిచూస్తుంటాడు.

టికెట్స్ ఇష్యూ చేయడం పూర్త యిందేమో కండక్టర్ బెల్ కొట్టాడు. బస్ మళ్ళీ బయలుదేరింది. కుదుపుతో ఆలోచనల నుంచి బయట పడ్డాడు మూర్తి.

బస్సులో వాళ్ళు రకరకాల సమ స్యల్ని చర్చించుకుంటున్నారు. కిరోసిన్ దొరకడం లేదని ఒకరు, పంచదార కోటా సరిపోవడం లేదని మరొకరు, ఇలాంటి స్థితి ఇంకా కొన్నేళ్ళు సాగితే దేశం కరువు కాటకాలతో తలమునకలుకాక మరేమవుతుందని వయసు మళ్ళిన కొందరు.


ఉదయమే ప్రశాంతంగా గడుపుదా మనుకున్న మూర్తి ఇవన్నీ వింటూ అసహనంగా నిట్టూర్చాడు. స్టేజీ స్టేజీలో ఆగుతూ బస్ పోతూనే ఉంది.

ఇంట్లో చిన్న చెల్లాయికీ, చిన్న తమ్ముడికీ జ్వరం. అది ముదరక ముందే మందు తేవాలి. ఆరోగ్యం, బయటి వ్యవహారాల పోర్ట్‌ఫోలియో తనదికదూ అని నవ్వుకున్నాడు.

సభ్య సమాజంలో ముఖంమీద వెలిగే చిరునవ్వుకు ఎంతో ప్రాముఖ్యం ఉంది, పడుతున్న బాధలూ, ఎదుర్కొంటున్న కష్టాలూ ముఖంమీద కనిపించకుండా చిరునవ్వు కప్పేస్తుంది.

చిరునవ్వుతో హాస్పిటల్లో అడుగు పెట్టాడు మూర్తి.

“హలో, డాక్టర్‌గారూ!” అంటూ



**జత**

ఫోటో— కె. మధుసూదనాచారి (ఆసిఫాబాదు)

ఎవరో పిలిచారు. వెనక్కి తిరిగిచూశాడు మూర్తి.

నారాయణ. ఎలెక్ట్రిసిటీ ఆఫీసతను. తనతో ఇప్పుడు పని పడింది కాబోలు. ఇడియట్! అప్లై చేసి, డబ్బుకట్టి రెండు నెలలు దాటినా కరెంట్ కనెక్షన్ ఇవ్వని అతనంటే కసి పెరిగింది. అప్పుడే చాటుకు పిలిచి పదో పాతికో చేతిలో పెట్టి ఉంటే వెంటనే కనెక్షన్ ఇప్పించే ఏర్పాటుచేసేవాడేమో!

“నమస్కారం, సార్! మా మిసెస్‌ను తీసుకొచ్చాము. దయచేసి మీరు ఆ డాక్టర్‌గారికి చెప్పండి” అన్న నారాయణ మాటలతో, తనలోని కసిని లోపలే దాచుకొని వివరాలు అడగడం మొదలు పెట్టాడు.

అన్నీ అయిన తరవాత — “డాక్టర్స్ ఇంకా రాలేదు, సార్! రాగానే ఫస్ట్ ప్రయారిటీ మీకే, సీనియారిటీ లిస్ట్‌లో ముందు మీ పేరే ఉంది” అని ఇంకా ఏదో చెప్పుకుపోతున్నాడు. నవ్వుతూ ఊ కొట్టి, “వార్డులో కెళ్ళాలి. మళ్ళీ కనిపిస్తాను” అని లోపలికి నడిచాడు.

హాస్పిటల్లో పేషంట్లను చూస్తున్న కొద్దీ రోజు ఏదో రకమైన ఉదాసీనత పెరిగిపోసాగింది. వీళ్ళంతా ఎలా బ్రతుకుతున్నారో, ఎందుకు బ్రతుకుతున్నారో అన్న ఆలోచన మనసులో మెదిలినప్పుడు ముందుగా తన కుటుంబమే గుర్తు కొస్తుంది. పేషంట్ల హిస్టరీ మీద కాన్‌సెన్‌ట్రేషన్ తగ్గుతూంది.

గౌన్ వేసుకొని, మాస్క్ కట్టుకొని లేబర్ రూంలో కెళ్ళాడు.

ఉన్నవాళ్ళకే పరిమితమైన అవకాశాలు, సౌకర్యాలు లేకపోతూంటే కొత్తవాళ్ళను సంఘానికి పరిచయం చేయడంకోసం తల్లులు పడే బాధ — వాళ్ళ మీద జాలిని కలిగిస్తూంది.

ఒక టేబుల్ ముందాగాడు. పురిటి నొప్పులతో మెలికలు తిరిగిపోతూందామె. ముప్ఫై అయిదు, నలభై మధ్య ఉంటుందేమో ఆమె వయసు.

ఆ స్థితిలో ఆమె తన ప్రశ్నలకేం సమాధాన మిస్తుంది?

పక్కనే ఉన్న కేస్ షీట్ తీసి చూశాడు. గ్రావిడా ట్వెల్వ్. పారా ఎలెవెన్. అంటే ఆమె కిది పన్నెండో కాన్పు. పదకొండు మంది పిల్లలున్నారు. పెద్ద అమ్మాయో, అబ్బాయో కనీసం తనంత వయసు ఉండి ఉంటుంది.

ఆ పదకొండుమందిని పోషిస్తూ, చదువులు చెప్పిస్తూ, వాళ్ళ అవసరాలు తీరుస్తూ, పెరుగుతున్న ధరల్ని తట్టుకుంటూ జీవితాన్ని ఎలా వెళ్ళబుచ్చుతున్నారో?

“వాళ్ళ ఆలనా పాలనా ఎలా ఉందో గానీ, నేనుమాత్రం ఈ భూమిమీదికి రాను” అని ఆమె కడుపులో ఉన్న శిశువు అడ్డం తిరిగింది. ‘ట్రాన్స్‌వర్స్’ ఆర్ ‘ఆబ్లిక్ లై’ అని వైద్య భాషలో అంటారు.

సిజేరియన్ ఆపరేషన్‌తో ఆ శిశువును ఈ సమాజానికి పరిచయం చేయడం ఖాయం. కానీ, ఇప్పు డామెకు ఏమైనా అయితే? పన్నెండు మందీ తల్లి లేని పిల్లలవుతారు. ఆమె భర్త జీవిత భాగస్వామినిని కోల్పోయి చీకటిలో మునిగి పోతాడు. కుమిలిపోతాడు, తన మూర్ఖత్వానికి ఈమాత్రం శిక్ష సరిపోదంటూ గుండె లవిసేలా ఏడుస్తాడు.

“మై గాడ్!” అని కళ్ళు మూసుకొని కేస్‌షీట్ పక్కన పెట్టేశాడు.

ఛీఫ్ వచ్చి ఆ పేషెంటును ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌కు తరలించే సూచన లిస్తున్నారు. ఆ పేషెంటును చూసి జాలిపడ్డాడు మూర్తి.

ఆపరేషన్ థియేటర్‌కు తానూ వెళ్ళడమా, మానడమా అని ఆలోచిస్తూ మరో టేబిల్ దగ్గరి కెళ్ళాడు.

నొప్పులతో కేకలు వేస్తూ, మెలికలు తిరిగిపోతూ పల్లని తల్లులు.

కసురుకుంటూ ఆయాలు.

డెలివరీ కండక్ట్ చేయడంకోసం స్టూడెంట్ నర్సులు, ఇంటర్నీలు.

తల మొద్దుబారిన ట్లనిపించింది మూర్తికి.

గబగబా బయటకి నడిచి ఇంటర్నీ రూంలో వాలుకుర్చీలో కూర్చుని తల పట్టుకొని కళ్ళుమూసుకున్నాడు.

కనుచూపుమేరలో పరిష్కారాలు కనిపించని లెక్కకు మించిన సమస్యలు మెదడులో ప్రళయాన్ని సృష్టిస్తున్నాయి.

“డాక్టర్ మూర్తి! ఇక్కడున్నారా?

థియేటర్‌కు రావడం లేదా?'' అప్పుడే ఇంటర్నీస్ రూంలోకొచ్చిన సురేందర్, దస్వీర్‌లు అడిగారు.

సమాధానంగా నవ్వాడు మూర్తి. వస్తున్నాననో, రాననో తెలియదు.

''ఆలోచనల ముసురులో ఉన్నట్టున్నావ్. ఇదుగో సిగరెట్'' అంటూ సిగరెట్ ఆఫర్ చేశాడు సుధీర్.

''ఏ బ్రాండ్?'' అన్నాను, అందుకో డానికి చేయి సాచకుండానే.

''ప్రిన్స్ హెన్రీ.'' సమాధాన మిచ్చాడు సుధీర్.

''సారీ! నే నా బ్రాండ్ కాల్చను'' అన్నాడు మూర్తి.

''నిజంగా సిగరెట్ తాగేవాడిలాగే పోజు పెట్టావ్, గురూ?'' అని నవ్వాడు రాబిన్.

బుగ్గలు సొట్టలు పడే సుభాష్ నవ్వాడు.

ఆరుగురూ కలిసి ఆపరేషన్ థియేటర్ లోకి నడిచారు.

అంతకుముందు చూసిన పన్నెండో కాన్పు ఆమెను టేబుల్ మీద పడుకో బెట్టారు. అనెస్థెటిస్ట్ తన పని తాను చేసుకుపోతున్నాడు.

ఆపరేషన్ చేస్తూ, 'కాంప్లికేషన్స్ ఆఫ్ ట్రాన్స్‌వర్స్‌లై'ని గురించి ప్రశ్న లడుగుతూంది డాక్టర్.

తోచిన సమాధానా లిస్తున్నారు. మనసును ఇంటికి పంపించాడు మూర్తి.

ఈపాటికి అమ్మ, బుజ్జి ఘర్షణపడు తుంటారు.

కాలేజీ అడ్మిషన్ ఫీజు అడుగుతాడు. మీ నాన్నగారి నడగమంటుంది అమ్మ.


''నే నే దడిగినా అంతేనే— ఇంట్లో డబ్బులేదు డబ్బులేదు అనే సమాధానం చెబుతారు!'' అంటాడు వాడు నిష్ఠూరంగా.

''మీ ఆఫీసులో ఎవరినైనా అడిగి తీసుకో, మీ నాన్నగారి టి. ఎ. బిల్ రాగానే ఇచ్చేద్దాం'' అంటుంది అమ్మ.

''నా కెవడూ అప్పు ఇవ్వడం జరగదు'' అని గట్టిగా, నిక్కచ్చిగా సమాధానమిచ్చి— ''ఈ సంవత్సరం ఎమ్. ఎ. లో చేరను'' అని వాకౌట్ చేస్తాడు వాడు.

అమ్మ వాణ్ణే తిడుతుంది. వాడు గొంతు పెంచుతాడు. చిన్నచెల్లాయో, చిన్న తమ్ముడో అమ్మ నేదో అడగడంతో ఆ ఘర్షణకు ఇంటర్వెల్ అవుతుంది.

''డాక్టర్! సీ హెర్ బి. పి.'' అన్న ఆర్డర్‌తో ఉలిక్కిపడి, 'అరే! అప్పుడే ఆపరేషన్ అయిపోయిందా? మరి ఆ శిశువు ఏడవలేదా? ఏడ్చినా తాను గమనించే స్థితిలో ఉండలేదా?' అనుకుంటూ బి. పి. చూడ్డానికి అపరేటస్‌ను తీసుకు రావడానికి పక్కకెళ్ళాడు.



అమ్మ దొంగ! ఫోటో — శ్రీ. వై. కుమార్ (విజయవాడ)

రోజూ ఇలాగే గజిబిజిగా గడిచిపో తుంటుంది.

ఆ రోజు సాయంత్రం —

రాత్రి ఏడు గంటలు దాటినా నాన్న గారు రాలేదు. ఆఫీసు కాగానే ఆరు గంటల్లోపలే వచ్చే నాన్నగారు ఈ రోజు ఎందుకు రాలేదు?

మనసు కీడును శంకిస్తూంది.

అసలే ఈ మధ్య ఆరోగ్యం బాగాలేదు. పైగా సైకిలింగ్. ఆఫీసులో ఎక్కువ పని ఉండిపోయిందా?

సైకిల్‌మీద వస్తూంటే ఇతరుల నిర్లక్ష్యం వల్ల ఏక్సిడెంట్ లాంటిది... ఛ ఛ ... ఏమి టీ ఆలోచన!

ఇలాంటి ఆలోచన ఎప్పుడొచ్చినా రీసెంట్‌గా చూసిన మార్చ్యురీలోని శవమే గుర్తు కొస్తూంది.

ఉదయమే ఫాక్టరీకి బయలుదేరిన మధ్యవయస్కుడు లారీ కింద పడ్డాడు. కాలు పూర్తిగా విరిగింది. రక్తంపోవడం వల్ల, దాని మూలంగా వచ్చిన షాక్ వల్ల చనిపోయాడు. అతని వస్తువులతోబాటు అతని శవాన్ని మార్చ్యురీ చేర్చారు పోలీసువాళ్ళు. ఒక చేతి సంచి. అందులో అన్నం ఉన్న టిఫిన్, సాంబారు ఉన్న మూతగల సీసా.

వెంట తెచ్చుకున్న అన్నం, సాంబారు తినే యోగాన్ని బయలుదేరిన కొన్ని గంటలకే పోగొట్టుకొన్న అభాగ్యుడు. పాపం! అతని కెంతమంది పిల్లలో? ఎంతమంది ఆధారపడి బ్రతుకుతున్నారో? పందిరి కూలిపోతే, ఆ పందిరి నల్లుకున్న తీగల భవిష్యత్తేమిటి?

ఛీ ఛీ ... ఏమి టీ ఆలోచనలు!

కాలేజీ నుంచి ఇంటికి రావడం ఒక గంట ఆలస్యమైతే నాన్నగారు మెదడు నిండా ఏక్సిడెంట్లు, స్టాబింగ్ పోట్లాటలు, కత్తిపోట్లు — ఇవే గుర్తుచేసుకుంటారు. వాటితో ఇంట్లో అందరినీ గాభరా పెట్టేస్తారు.

దట్టంగా అల్లుకుపోయిన ప్రేమాను బంధాలు మరీ సున్నితంగా ఆలోచింప జేసి ఇలా ఇబ్బంది పెట్టడం, ఆ తరవాత మనసుకు హాయిని కలిగిస్తుంది. కానీ, మొదట్లో వ్యక్తంచేయలేని శంకలతో మనస్సును చీకట్లో ముంచేస్తుంది.

ఏడున్నర దాటినా నాన్నగారు రాలేదు.

పిల్లలు, వాళ్ళ ఖర్చులు, ఇంట్లో ఖర్చులు, తన బాధ్యత...వీటితో రోజుకు కనీసం గంటయినా హాయిగా నిద్రపో గలరా అన్న సందేహం చోటుచేసుకుంది.

''సెల్ఫ్ మేడ్ మాన్ డాడీ! హాట్సాఫ్ టు యువర్ పేషెన్స్ అండ్ కరేజియస్ స్ట్రగుల్ ఇన్ లైఫ్'' అనాలనిపిస్తుంటుంది.

ఆలోచనల్ని అదుపులో ఉంచుకొని ఇంటర్నీషిప్ మూలంగా రాత్రి బయలు దేరాడు హాస్పిటల్‌కు.

చీకటి రాజ్యం చేస్తూంది.

ఉడతాభక్తిలా చీకటిని తరమడానికి రోడు కిరుప్రక్కలా ఉన్న వీథిలైట్లు ప్రయత్నిస్తున్నాయి.

జీవితం వడ్డించిన విస్తరిలా సుఖంగా సాగిపోతుందనుకున్న యువతరంలా లైట్ల కాంతికి ఆకర్షింపబడి వాటి చుట్టూ తిరుగుతున్నాయి రెక్కల పురుగులు.

జీవితంలో డబ్బు ఎంత ప్రాముఖ్యం వహిస్తుందో, ఎలాంటి ప్రధానపాత్ర నిర్వహిస్తుందో తలుచుకుంటే నవ్వు వస్తుంది. వెంటనే తన మీద తనకు జాలి కలుగుతుంది. సెల్ఫ్ పిటీ అంత మిజరబుల్ థింగ్ మరేదీ ఉండదనుకున్నా, జాలిపడక తప్పడం లేదు.

ఉదయమే సురేష్ అన్న మాటలు గుర్తుకొచ్చాయి మూర్తికి.

''మూర్తీ! మీ రో కథ వ్రాసి నా కివ్వండి. పేరుకోసం కాదు. ఆ కథకు వచ్చే పారితోషికంకోసం. మా డాడీ పంపించిన డబ్బు నిన్నటితో సర్వమంగళం పాడింది. ఈ నెలంతా ఎలా గడపాలో తెలియడం లేదు.''

సంపాదించే అవకాశం లేక, ఉద్యోగాలు దొరక్క, అవసరాలను వక్కాను పెట్టలేక, వయసు పెరుగుతున్నా తల్లిదండ్రులకింకా భారంగానే ఉంటూన్న ఈ యువతరానికి తమ కాళ్ళమీద తాము నిలబడ గలిగే రోజు ఎప్పుడొస్తుంది?

పదిహేను రూపాయలకోసం తమ రక్తాన్ని అమ్ముకోడానికి బ్లడ్ బాంక్ ముందు క్యూలలో నిలబడ్డ వ్యక్తుల జీవితాలు సాఫీగా ఎప్పుడు నడుస్తాయి?

ఈ సమస్యలు సమసిపోవేమో ననిపిస్తుంది. అయినా, చిరునవ్వులతోనే తిరుగుతూ గడిపేస్తుంటారు.

మరి మధ్యతరగతి మందహాసం అంటే అదే నేమో? నవ్వుకుంటూ హాస్పిటల్ గేటులోంచి లోపలికి నడిచాడు మూర్తి.

★